## క్లుప్తంగా

### ఎల్వీ ప్రతాప్ సేవలు ఎనలేనివి



ఎంఈవో-2 ఎల్వీ ప్రతాప్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: ఉపాధ్యాయుడిగా, మండల విద్యా శాఖాధికారిగా లఖినాన విశ్వప్రతాప్ (ఎల్వీ ప్రతాప్) సేవలు ఎనలేనివని కోటబొమ్మాళి మండల ఉపాధ్యాయులు కొనియాడారు. ఎంఈవో-2గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఆయనను మండలంలోని ఉపాధ్యాయులంతా గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మంచికి మారుపేరుగా ప్రతాప్ నిలిచారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఎంతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా, మండల విద్యా శాఖాధికారిగా విశేషమైన సేవలు అందజేశారని తెలియజేశారు.

### విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



పాఠశాలకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

మందస: మండలంలోని పొత్తంగి - సిరిపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి సునీల్ మహంతి తను చదువుకున్న పాఠశాలలోని క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని హెచ్ఎం ఎస్.తారకేశ్వరరావు చేతులమీదుగా గురువారం అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఈసీ మెంబర్‌గా నర్సింగరావు



బెండి నర్సింగరావు

టెక్కలి: ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా టెక్కలి మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బెండి నర్సింగరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు సోమసుందర్, నల్లి ధర్మారావు, జగదీష్, రమేష్ తదితరుల సహకారంతో పని చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

### చట్టాలపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

కాశీబుగ్గ: విద్యార్థినులు, మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని ప్రిన్సిపాల్ డా.జె.వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు మానసికంగా శక్తివంతంగా ఉండాలని సూచించారు. కళాశాల నుంచి ఇందిరాగాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మహిళల సాధికారత కో-ఆర్డినేటర్ ఎ.సునీత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా ప్రేమ్‌చంద్ జయంతి



ప్రేమ్‌చంద్ జయంతిలో పాల్గొన్న విద్యార్థులు

కంచిలి: విశ్వ సాహిత్యంలో భారతీయ సాహిత్యానికి గౌరవాన్ని పెంచిన మేటి హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని మండలంలోని బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముప్పన ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలను విద్యార్థులతో కలిసి చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా తదితరులు పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్‌లో సమస్యలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్యాంప్రసాద్ రెడ్డి

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి విద్యార్థులతో కలిసి హాస్టల్‌లో ఆయన భోజనం చేశారు. దీనిలో భాగంగా విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. పరిశుభ్రమైన నీరులేక మున్సిపల్ వాటర్ తాగుతున్నామని, గదుల్లో ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. రాత్రి సమయాల్లో వాచ్‌మెన్ కానీ, అటెండర్ కానీ ఉండడం లేదని శ్యాంప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

---

# అసౌకర్యాలతో.. విద్యార్థుల సతమతం!

- కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కానరాని సౌకర్యాలు
- తాగునీరు లేక అవస్థలు
- నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం



మరమ్మతులకు గురైన ట్యాప్‌ల వద్ద ప్లేట్లు కడుగుతున్న పిల్లలు



నేలమీద కూర్చున్న పదో తరగతి విద్యార్థులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసౌకర్యాలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పాఠశాల పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. సరైన ఆటస్థలం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 678 మంది బాలబాలికలు చదువుతున్నారు. కానీ వీరికి సరిపడా వసతి, ఇతర సౌకర్యాల కల్పన చేపట్టలేదు. కేవలం మూడు తరగతుల్లోనే విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. మిగతా వారంతా కిందనే కూర్చొని చదువుతున్నారు. మారుమూల పాఠశాలల్లో సైతం విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదు. అలాగే వందలాది పిల్లలు ఇక్కడ చదువుతున్నప్పటికీ తాగునీరు లేదు. గతంలో ఓ దాత ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటు ప్రస్తుతం మరమ్మతులకు గురైంది. దీన్ని బాగు చేయించే నాథుడేలేకుండా పోయాడు. దీంతో పిల్లలు ఇళ్ల నుంచి నీరు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు.

**వంటగది కూడా లేదు..**

మధ్యాహ్న భోజనం తయారు చేయడానికి వంటగది శాశ్వతంగా నిర్మించలేదు. దీంతో పాతబడిన రేకులషెడ్డును వంట ఏజెన్సీవారు నిర్మించుకొని అందులోనే వంటలు చేస్తున్నారు. అలాగే మధ్యాహ్న భోజనాలు ఆరగించడానికి డైనింగ్ హాలు లేకపోవడంతో ఆరుబయటనే విద్యార్థు భోజనాలు చేస్తున్నారు. భోజనం పూర్తయిన తర్వాత చేతులు కడుక్కోవడానికి వాటర్ ట్యాప్‌లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్లేట్లు కడుక్కొనే చోట నీరు వృథా అవుతోంది.



పనిచేయని శుద్ధజల ప్లాంట్



ఈ రేకుల షెడ్డే వంటగది

**ప్యానెల్ బోర్డులు కొరత**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మనబడి 'నాడు-నేడు'పథకం కింద ఎనిమిది తరగతి గదులను మంజూరు చేశారు. వీటిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు గదులు నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టగా.. ఫస్ట్ ఫ్లోర్‌లో నాలుగు గదులకు కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయలేదు. ఈ బిల్డింగ్‌లో నాడు-నేడు పథకం కింద ఏర్పాటు చేయాల్సిన ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో బ్లాక్ బోర్డుల మీదే పాత పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. అలాగే మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ఆయన వాటిని పాఠశాలకు అప్పగించలేదు. దీంతో పిల్లలు టాయిలెట్స్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. పాత టాయిలెట్స్‌నే బాలికలు ఉపయోగిస్తుండగా, బాలురు మాత్రం ఆరుబయటకు వెళుతున్నారు. ఇలా ఈ పాఠశాలలో అసౌకర్యాలు తిష్టవేయడంతో, విద్యార్థులు చదువుపై దృష్టిసారించలేని పరిస్థితి నెలకుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించుకొని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆరు బయటే భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

**తాగునీరు లేదు..**



పాఠశాలలో తాగునీరు నీరలేక ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. టాయిలెట్స్ కొత్తవి నిర్మించినప్పటికీ వాటిని ప్రారంభించకపోవడంతో పాత టాయిలెట్స్‌నే వాడుతున్నాం. దీంతో అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– పి.మేఘన, పదో తరగతి విద్యార్థిని

**నేలపైనే కూర్చోవాలి..**



బెంచిలు ఏర్పాటు చేయక పోవడంతో నేలమీదే కూర్చొని తరగతులు వింటున్నాం. పాఠశాలలో మూడు తరగతులకే బెంచీలు ఏర్పాటు చేశారు. మిగతా తరగతులన్నీ నేలమీదే నిర్వహిస్తున్నారు. ఆధునిక తరగతి గదులున్నప్పటికీ విధిలేని పరిస్థితిలో నేలమీదే చదువులు సాగిస్తున్నాం.

– రాజేష్, పదో తరగతి విద్యార్థి

**ఉన్నతాధికారులకు నివేదించాం..**



పాఠశాలలో నెలకున్న సమస్యలను ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదించాం. ఉన్నంతలో సర్దుకొని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నిర్వహణ చేపడుతున్నాం. ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నాం.

– ఎస్.చాణక్య, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కంచిలి

---

# ఏడాది పాలన మోసాలమయం



కాశీబుగ్గ: మున్సిపాలిటీలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మందస: బహడపల్లి గ్రామంలో...



వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడుపేట గ్రామంలో



పలాస: పెదంచల గ్రామంలో...



కంచిలి: జలంత్రకోట పంచాయతీలో...



కంచిలి: మకరాంపురం గ్రామంలో...



సంతబొమ్మాళి: చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న పేరాడ తిలక్, మోహన్‌రెడ్డి, వసంతరెడ్డి తదితరులు



టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి పంచాయతీలో...



టెక్కలి: నందిగాం మండలం నౌగాం పంచాయతీలో...



సోంపేట: పాత్రకొండలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ దాస్ తదితరులు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలమయమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాల అమలు తీరుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ మరోసారి వచ్చేసినా ఇంతవరకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అమలు చేయలేమని తెలిసినా, ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పథకానికి ఇంకా అర్హులున్నా కొందరికే వేసి ప్రజలను మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

# మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

కంచిలి: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు గురుకులం ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటి ఖాళీల వివరాలిలా ఉన్నాయి.

| తరగతి | ఎస్సీ | ఎస్టీ | బీసీ-సీ | బీసీ | ఓసీ | మొత్తం ఖాళీలు |
|---|---|---|---|---|---|---|
| 5వ తరగతి | 29 | 3 | 10 | - | 1 | 43 |
| 6వ తరగతి | 21 | - | 3 | - | 1 | 25 |
| 7వ తరగతి | 10 | - | 10 | - | 1 | 21 |
| 8వ తరగతి | 5 | - | - | - | 1 | 6 |
| 9వ తరగతి | - | - | - | - | 1 | 1 |
| ఇంటర్మీడియట్ (ఎంపీసీ) | 27 | 1 | - | 2 | - | 30 |
| ఇంటర్మీడియట్ (బైపీసీ) | 1 | 2 | 7 | - | - | 10 |

### నాయకత్వ లక్షణాలపై శిక్షణ



గణితావధాని తిరుపతిరావును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: కాశీబుగ్గ సూర్యతేజ కళాశాలలో నాయకత్వ లక్షణాలపై 12 మండలాలకు హెచ్ఎంలకు ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, సీహెచ్ సత్యం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మద్దు తిరుపతిరావుచే గణిత దశావధానం కార్యక్రమం చేపట్టారు. గణితంలోని వివిధ అంశాలపై పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో జవాబులు చెప్పి ఆయన ఆకట్టుకున్నారు. అనంతరం తిరుపతిరావును సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులతో ప్రాజెక్టు చైర్మన్ సీవీ రాజా తదితరులు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. 2024-25 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు రూ.5,500 నగదును సంస్థ ప్రాజెక్టు చైర్మన్ సీవీ రాజా చేతులమీదుగా అందించారు. అలాగే 15 మంది నిరుపేద విద్యార్థులు, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్టేషనరీ ఐటమ్స్ అందజేశారు. ఈ ఏడాది నుంచి ప్రతీ పరీక్షలో ప్రతిభ చూపినవారికి తరగతుల వారీగా అవార్డులు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

### సేవలతోనే గుర్తింపు

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన హనుమంతు కృష్ణారావును అదే పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# సహ చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న భవానీ శంకరరావు



కంచిలి: వీఏఏలకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సురేష్



వజ్రపుకొత్తూరులో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రామారావు

సోంపేట: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ సహాయ సంచాలకుడు టి.భవానీ శంకరరావు సూచించారు. మండలంలోని బెంకిలి పంచాయతీలో రైతులతో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, గ్రామస్తులు బి.మోహనరావు, జె.పురుషోత్తం, ఎం.బుద్ధేశ్వరరావు, సింహాచలం పాడి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలం కేంద్రంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులకు, రైతులకు అవగాహన కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన సమాచారం అందించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదన్నారు. ప్రతీ పత్రాన్ని భద్రంగా, డిజిటలైజేషన్ చేసి ఉంచాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అర్జీదారుడు కోరుకున్న సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఏవో బమ్మిడి ధనుంజయరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: సమాచార హక్కు చట్టంలో భాగంగా ఎవరైనా వ్యక్తి సమాచారం కోరిన 30 రోజుల్లో తగిన రుసుము తీసుకొని సమాచారం అందజేయాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి కె.సురేష్ పేర్కొన్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు సమాచార హక్కు చట్టం-2005పై గురువారం అవగాహన కల్పించారు. ఉద్యోగులు జవాబుదారీతనం కలిగి ఉండాలని, సరైన రికార్డుల నిర్వహణ అవసరం ఉందన్నారు. సరైన కారణం లేకుండా కోరిన సమాచారం ఇవ్వడంలో ఆలస్యం చేయడం, తిరస్కరించడం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనం, వ్యక్తిగత సమాచారం వ్యత్యాసాన్ని తెలుసుకోవాలని సూచించారు.

### • వాహనాలు ఇలా.. రాకపోకలు ఎలా..?



టెక్కలి జిల్లా ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు వాహనాలను రహదారికి అడ్డంగా పెట్టేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఆస్పత్రిలో అందరికీ వీలుగా ఉండే పాత గేటును మూసివేసి నూతనంగా కొత్త గేటు ఏర్పాటు చేశారు. అయితే ఆ మార్గంలో వచ్చే వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను ఎమర్జెన్సీ వార్డు ముందు ఇష్టానుసారంగా పార్క్ చేస్తున్నారు. దీంతో ఆస్పత్రికి 108 వాహనాలు వచ్చేందుకు సైతం వీలులేకుండా పోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వాహనాలు పార్కింగ్ స్థలంలో పెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

### సామాజిక భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన సామంత కుల సంక్షేమ సంఘ భవనాన్ని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎలుసూరి బాబావతి అప్పారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుర్గాసి ధర్మారావు, గుమ్మడి రామదాసు, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతిరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దు వెంకటరావు, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు బెందాళం శోభన్‌బాబు, చిన్నకొజ్జిరియా సర్పంచ్ గొనప సీతారాం తదితరులు పాల్గొన్నారు